నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, ఆదివారం 16 జూన్ 2024 | MEDAK

ధర్మకర్తల మండలికి గ్రీన్‌సిగ్నల్

చేర్యాల, జూన్ 15: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ధర్మకర్తల మండలి నియామకానికి కాంగ్రెస్ సర్కారు మార్చి 4న దేవాదాయ శాఖకు అనుమతి ఇచ్చింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దేవాదాయ శాఖ ధర్మకర్తల మండలి నియామకానికి ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. తాజాగా కొమురవెల్లి మల్లన్న ఆలయవర్గాలు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పేరిట ఈనెల 8న మల్లన్న ఆలయ ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ విడుదల చేశారు. కానీ నోటిఫికేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచడంతో అలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ ప్రకారం 20 రోజుల్లోగా అర్హులైన వారు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. కానీ, గతంలో విధులు నిర్వహించిన మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీనే మళ్లీ నియమిస్తారా? లేదా కొత్త వారితో కమిటీ ఏర్పాటు చేస్తారా? అనే విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

దుబ్బాక మైనార్టీ గురుకులం నుంచి తరలిస్తున్న నోటు పుస్తకాలను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

నోటు పుస్తకాలనూ వదలని సర్కారు

దుబ్బాక గురుకుల పాఠశాల నుంచి కేసీఆర్ చిత్రపటం ఉన్న నోటు పుస్తకాలు తరలింపు

- కాంగ్రెస్ తీరుపై ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం
- ఆంధ్రాలో జగన్ చిత్రపటంతో ఉన్న పుస్తకాలు పంపిణీ
- తెలంగాణలో కేసీఆర్ చిత్రపటాన్ని తొలిగించడం బాధాకరం

దుబ్బాక, జూన్ 15: కాంగ్రెస్ ప్రభుత్వం స్వార్థ రాజకీయం కోసం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందించే నోటు పుస్తకాలను సైతం వదలడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శనివారం సాయంత్రం దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఆ సమయంలో గురుకులం నుంచి డీసీఎంలో నోటు పుస్తకాలను తరలిస్తున్నారు. ఆ నోటు పుస్తకాలపై కేసీఆర్ చిత్రపటం ఉండటమే కారణమని, అధికారుల సూచనల మేరకు ఆ నోటు పుస్తకాలను సంగారెడ్డి జిల్లా కందికి తరలిస్తున్నట్లు గురుకుల సిబ్బంది వివరించారు. పాఠ్య పుస్తకాలే కాకుండా నోటు పుస్తకాలను వదలకపోవడంపై ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలపై కేసీఆర్ చిత్రపటం తొలిగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల రూపాయలను దుర్వినియోగం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పాఠ్య పుస్తకాలపై మాజీ సీఎం జగన్ చిత్రపటాన్ని అక్కడి ప్రభుత్వం తొలిగించలేదని గుర్తు చేశారు. నోటు పుస్తకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. విద్యా సంవత్సరం ఆరంభంలో విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. గురుకులంలో విద్యార్థులకు అందజేయాల్సిన పాఠ్య, నోటు పుస్తకాలు సకాలంలో అందించకపోవడంతో విద్యాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందేనా!

పట్టాల కోసం గజ్వేల్ మున్సిపల్, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

- ఎంపికైన లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని నిరసన
- మరోసారి రీ సర్వే చేయాలని మంత్రి కొండా సురేఖను కలిసిన నాయకులు
- ఇప్పటికే కొంతమంది ఇండ్లలో నివాసం
- అధికారులకు తలనొప్పిగా మారిన ఇండ్ల పంచాయితీ
- ప్రభుత్వం సహకరిస్తేనే సమస్య కొలిక్కి వచ్చే అవకాశం



గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులను సముదాయిస్తున్న ఆర్డీవో బన్సీలాల్ (ఫైల్)

గజ్వేల్, జూన్ 15: పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ అధికారులకు తలనొప్పిగా మారింది. లబ్ధిదారులు పట్టాలెప్పుడిస్తారని గజ్వేల్ మున్సిపల్, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక చేసి అర్హులను ప్రకటించారు. అయితే డ్రాలో ఎంపికైన వారిలో అనర్హులున్నరంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి మరోసారి రీ సర్వే చేయించాలని కోరారు. మరోసారి రీ సర్వే చేస్తే తమ పేర్లు వచ్చేనా అంటూ డ్రాలో ఎంపికైన లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తీసుకునే నిర్ణయం కోసం లబ్ధిదారులు వేచి చూస్తున్నారు.

పట్టాలు అందజేసి ఇండ్లు చూపించాలి

గజ్వేల్ పట్టణ సమీపంలోని సంగాపూర్ వద్ద డబుల్ బెడ్‌రూం ఇండ్లను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వేల అనంతరం అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో లక్కీడ్రా తీసి అర్హులను ప్రకటించారు. అయితే వారికి పట్టా సర్టిఫికెట్లను ఇవ్వకపోవడంతో పలుమార్లు ఆందోళన చేపట్టారు. ఆరు నెలలుగా లబ్ధిదారులు డబుల్ ఇండ్ల కోసం అనేకసార్లు రోడ్డెక్కిన సమయంలో రెవెన్యూ, పోలీస్ అధికారుల జోక్యం చేసుకొని జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంలో సమస్య సద్దుమణుగుతుంది. ఇటీవల లబ్ధిదారులు పట్టా సర్టిఫికెట్లు అందజేసి ఇండ్లు చూపించాలని కోరుతూ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిని కలిసి సమస్యను వివరించడంతో జిల్లా అధికారులతో మాట్లాడుతానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

రీ సర్వే చేస్తే లబ్ధిదారుల్లో ఆందోళన

లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు అవకాశం లభించిందని, మరోసారి రీసర్వే చేయించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను మాజీఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు కలిసి సమస్యను తెలిపారు. రీ సర్వే చేస్తే డ్రాలో ఎంపికైన వారి పరిస్థితి ఎలా అంటూ లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. లక్కీ డ్రాలో ఎంపికైన వారు ఇంటి నెంబర్ ఆధారంగా ఇప్పటికే కొంతమంది ఇండ్లలోకి ప్రవేశించి నివాసం ఉంటుండగా మరికొంత మంది ఇండ్లకు తాళాలు వేసుకున్నారు. అధికారులు తీసుకునే నిర్ణయం మేరకు లబ్ధిదారుల భవిష్యత్ ఆధారపడి ఉంది.

ప్యాకేజీ ఇస్తే ఖాళీ చేస్తామంటున్న ముంపు గ్రామాల ప్రజలు

మల్లన్న సాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు తాత్కాలికంగా అదే ఇండ్లలో అధికారులు నివాసం కల్పించారు. ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం నుంచి ప్యాకేజీలు రావాల్సి ఉందని, వాటిని పూర్తిస్థాయిలో అధికారులు ముంపు గ్రామాల ప్రజలకు ఇచ్చిన తర్వాతనే ఇండ్లు ఖాళీ చేస్తామంటున్నారు. గత నెలలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇండ్లలో నివాసం ఉంటున్నవారి వివరాలు తెలుసుకునేందుకు వెళ్లగా ముంపు గ్రామాల ప్రజలు అధికారులను అడ్డుకున్నారు. డబుల్ ఇండ్లలో నివాసం ఉంటున్న ముంపు గ్రామాల ప్రజలు ఖాళీ చేస్తేనే సమస్య పరిష్కారం కాదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వారు ఖాళీ చేయాలంటే ప్యాకేజీలు ఇవ్వాలని, అందుకు ప్రభుత్వం సహకరిస్తే కాని సమస్య కొలిక్కి వచ్చే పరిస్థితి కనిపించడం లేదంటున్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు (ఫైల్)

స్వగ్రామాన్ని సందర్శించిన 'అందెశ్రీ'

రేబర్తి గ్రామస్తులు, ఉపాధ్యాయులతో అందెశ్రీ

- అందెశ్రీకి సాదరంగా స్వాగతం పలికిన స్నేహితులు, బంధువులు
- పాఠశాల సందర్శన, సమస్యలపై ఆరా
- పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా: అందెశ్రీ

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 15: తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ శనివారం స్వగ్రామమైన మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామాన్ని సందర్శించారు. 'జయ జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతంగా ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన తర్వాత తొలిసారి అందెశ్రీ రేబర్తి గ్రామానికి రావడంతో చిన్ననాటి స్నేహితులు, బంధువులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అందెశ్రీ గ్రామంలోని స్నేహితులు, బంధువుల ఇంటికెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ చిల్పూరి భూపతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే గ్రామాన్ని సందర్శించి ఆత్మీయులతో ప్రత్యేకంగా సమావేశమవుతానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మగాని శివయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, మాజీ ఉపసర్పంచ్ బొద్దుల చంద్రమౌళి, హెచ్ఎంలు వరదరాజులు, బస్వరాజు కనకయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

వేతనాలు అందక పస్తులుంటున్నాం

- పంచాయతీ కార్మికుల ఆవేదన
- కొల్చారం తహసీల్ కార్యాలయ సిబ్బందికి వినతి

జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

కొల్చారం, జూన్ 15: వేతనాలు అందక పస్తులుంటున్నామని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ రాకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు నర్సమ్మ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు ప్రజలకు ప్రత్యేక సేవలు అందిస్తున్నారని, అతి తక్కువ వేతనంతో ఆరుగాలం శ్రమిస్తున్నారన్నారు. ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా నిలిపివేయడంతో పంచాయతీ కార్మికుల కుటుంబాలు పస్తుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అప్పులు తెచ్చి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. మూడు రోజుల పాటు పంచాయతీ కార్మికులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కూర్చొని ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో మల్లేశం, శేఖర్, యాదయ్య, భిక్షపతి, రాములు, ప్రభు, సురేఖ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కులమతాల పేరుతో లబ్ధిపొందిన బీజేపీ

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 15: దేశంలో కులమతాల పేరుతో ఓట్ల అడిగి రాజకీయ లబ్ధిపొందిన ఏకైక పార్టీ బీజేపీ అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేంద్రమోదీ మార్క్ అభివృద్ధి కేంద్రంలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడుందని ప్రశ్నించారు. దేశంలో బీజేపీకి ఈసారి పూర్తిస్థాయి మెజార్టీ ఇవ్వకుండా ప్రజలు ఛీకొట్టారన్నారు. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి మోదీ ప్రభుత్వానికి ఎదురైందన్నారు. అబ్ధదపు, మోసపూరిత హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదన్నారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్కరికి కూడా ఇవ్వకుండా ప్రభుత్వరంగాలను ప్రైవేటుపరం చేశారన్నారు. అదానీ, అంబానీలకు దేశాన్ని తాకట్టుపెట్టే పరిస్థితి తెచ్చిపెడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రదాత కేసీఆర్‌పై చేస్తున్న విమర్శలను మానుకోవాలని హితవు పలికారు. గజ్వేల్‌లో కేసీఆర్ మార్క్ అభివృద్ధి కనిపిస్తున్నా బీజేపీ నాయకులకు అది అర్థం కావడం లేదన్నారు. పదేండ్లలో తెలంగాణలో కేసీఆర్ చేసిన అభివృద్ధి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేశారా అని ఆయన ప్రశ్నించారు. గజ్వేల్‌ను కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఎడ్యుకేషన్ హబ్, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నిర్మాణం చేసి సాగు నీరిందించిన ఘనత ఆయకే దక్కుతుందన్నారు. ములుగులో విద్యార్థుల కోసం యూనివర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. గతంలో ఎన్నడూ కనిపించని అభివృద్ధి నేడు గజ్వేల్‌లో కనిపిస్తున్నదన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను వందశాతం అమలు చేయాలన్నారు.

దుబ్బాక అభివృద్ధే లక్ష్యం

దుబ్బాకలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- ప్రణాళిక ప్రకారం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందాం
- అభివృద్ధికి అన్ని పార్టీలు సహకరించాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం

దుబ్బాక, జూన్ 15: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుదామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మన ప్రాంతాభివృద్ధి కోసం రాజకీయాలను పక్కనబెట్టి అన్ని పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. శనివారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పీఆర్ సంబంధించిన రోడ్లు, భవనాల నిర్మాణ పనులతోపాటు పెండింగ్‌లో ఉన్న పనుల గురించి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో నూతనంగా పలు రోడ్లతోపాటు మరికొన్ని రోడ్ల మరమ్మతుల కోసం నిధులకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో 47 రోడ్లకు రూ.104 కోట్లు మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులోభాగంగా ఒక్కో శాఖకు సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల ఆర్‌అండ్‌బీ, వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామని తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నియోజకవర్గంలో పలు రహదారులకు రూ. 200 కోట్లు అవసరమని తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులకు కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించి, మంజూరు కోసం కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకూ సరైన రహదారులు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. దుబ్బాక అభివృద్ధి కోసం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నిధులు కేటాయించాలని కోరారు. సమీక్షలో పీఆర్ ఎస్ఈ జోగారెడ్డి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి, డీఈ విజయప్రకాశ్, ఏఈలు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, రిజ్వాన్, రామ్‌కుమార్, దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీలు రవీందర్‌రెడ్డి, సూకూరి లక్ష్మీలింగం, బీఆర్ఎస్ నాయకులు పోలబోయిన నారాగౌడ్, రణం శ్రీనివాస్, తౌడ శ్రీనివాస్, చింతల కృష్ణ, పంజాల శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీడిన బాలుడి హత్య మిస్టరీ

- కన్నతల్లే ఎనిమిదేండ్ల చిన్నారిని కడతేర్చింది..
- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని హత్య

హత్యకు పాల్పడిన తల్లి స్వాతి, సహకరించిన రెండో భర్త అనిల్, మృతుడు విష్ణువర్ధన్

పటాన్‌చెరు, జూన్ 15: ముత్తంగి ఔటర్ రింగురోడ్డు పొదల్లో లభించిన ఎనిమిదేండ్ల చిన్నారి శవం కేసు మర్డర్‌గా తేలింది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని కన్నతల్లే కొడుకును కడతేర్చింది. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం ముత్తంగి పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు పొదల్లో ఈనెల 11న బాలుడి శవం కనిపించింది. పోలీసులు హత్యగా అనుమానించి గుర్తుతెలియని శవంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాలుడు పాత రామచంద్రాపురానికి చెందిన కర్రె విష్ణువర్ధన్(8)గా గుర్తించారు. మృతుడు విష్ణువర్ధన్ తండ్రి కుమార్ మృతిచెందడంతో తల్లి కర్రె స్వాతి(30)వద్ద పెరుగుతున్నాడు. స్వాతిది కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం, పోల్కంపేట గ్రామం. పెండ్లి తర్వాత పాత రామచంద్రాపురంలో నివసిస్తున్నది. స్వాతి ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన అనిల్ (31)ను రెండో పెండ్లి చేసుకుంది. అనిల్ స్థానికంగా ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 10న విష్ణువర్ధన్ తల్లిని తిట్టడంతో తీవ్ర ఆగ్రహంతో ఆమె గొంతు నులిమి చంపింది. తర్వాత కంగారు పడి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు కిటికీకి టవల్ కట్టి బాలుడు ఉరేసుకున్నట్టుగా వేలాడదీసింది. అనంతరం అనిల్‌ను ఫోన్‌చేసి పిలిపించి విష్ణువర్ధన్ ఉరివేసుకుని చనిపోయాడని నమ్మించింది. స్వాతి గ్రామంలోని బంధువులకు ఫోన్‌చేసి విష్ణువర్ధన్ ఆత్మహత్యకు పాల్పడి చనిపోయినట్లుగా తెలిపింది. శవంతో ఊర్లోకి రావొద్దు బంధువులు అనడంతో ఏమి చేయాలో తెలియక అనిల్, స్వాతి అర్ధరాత్రి సమయంలో ముత్తంగి ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద సర్వీస్ రోడ్డు పొదల్లో విష్ణువర్ధన్ శవాన్ని పారవేసి పరారయ్యారు. ఈనెల 11న ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి పటాన్‌చెరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని శవంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. వాట్సాప్‌లో, సోషల్ మీడియాలో బాలుడి శవం చిత్రం వైరల్ కావడంతో ఆ వివరాలు పాత రామచంద్రాపురం పట్టణంలో వెలుగు చూశాయి. ఈమేరకు కర్రె స్వాతిని, రెండో భర్త దొంతు అనిల్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తే కుమారుడిని హత్య చేసినట్లు స్వాతి ఒప్పుకున్నది. దీంతో అనిల్‌ను, స్వాతిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డిని, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రాజును, క్రైమ్ పోలీసులకు డీఎస్పీ రవీందర్ అభినందించారు.

కొండపోచమ్మ రిజర్వాయర్ పరిశీలన

కొండపోచమ్మ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

ములుగు/మర్కూక్, జూన్ 15 : సిద్దిపేట జిల్లా మలుగు మండల పరిధిలోని కొండపోచమ్మ రిజర్వాయర్‌ను కలెక్టర్ మనుచౌదరి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం, భూసేకరణ, కాల్వల ఏర్పాటు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పునరావాస గ్రామమైన మామిడ్యాల్‌ను సందర్శించి తాత్కాలిక కేంద్రాల్లో ఉంటున్న కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఇండ్లలో సరైన వసతులు లేవని, ఇంకా చాలా కుటుంబాలకు ప్లాట్లు రావాలని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ మామిడ్యాల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో 100 ప్లాట్లను సిద్ధం చేయాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కొండపోచమ్మ సాగర్ ఎస్ఈ వేణు, ములుగు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నేడు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

హిమాయత్‌నగర్,జూన్15: ప్రమాదవశాత్తు జీవితం మధ్యలో ఏదైనా అవయవం కోల్పోయి దివ్యాంగులుగా మారిన వారు అవస్థలు పడవద్దనే సంకల్పంతో నేడు (ఆదివారం) హైదరాబాద్‌లోని కింగ్ కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆర్టిఫిషియల్ లింబ్, కాలిఫర్స్, ఫిట్‌మెంట్‌తో పాటు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్నట్లు నారాయణ్ సేవా సంస్థాన్ ట్రస్టీ డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా, కో-ఆర్డినేటర్ అల్కా చౌదరి తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతులు,కాళ్లు కోల్పోయి దివ్యాంగులుగా మారి దుర్భర జీవితం గడుపుతున్న వారికి విముక్తి కల్పించాలనే ఉద్దేశంతో గత 39 ఏండ్లుగా వివిధ రాష్ట్రాల్లోని దివ్యాంగులకు ప్రయోజనం కల్పించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. 2024 ఫిబ్రవరి 4న 1500మందికి కొలతలు తీసుకోగా, వీరిలో 800 మందికి కృత్రిమ అవయవాలు అందజేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సామాజికవేత్త రితేశ్ జగీర్దార్, సంస్థ ప్రతినిధులు ఉత్తమ్‌దామ్రాణి, మహేంద్రసింగ్ రావత్, జస్మిత్ పటేల్, భగవాన్ ప్రసాద్‌గౌర్ పాల్గొన్నారు.